సాక్షి నంద్యాల

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



ఉల్లాసంగా.. ఉత్సాహంగా
వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి బాలికల జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



అలరించిన నృత్య ప్రదర్శన
శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన కె.నరసింహులు బృందం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది.



అహోబిలేశునికి పూజలు
రుద్రవరం: పార్వేట ఉత్సవాల్లో భాగంగా శనివారం నక్కలదిన్నెకు చేరుకున్న అహోబిలేశునికి గ్రామస్తులు నీరాజనం పలికారు. జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

అన్నప్రసాద వితరణకు రూ.5లక్షల విరాళం



విరాళాన్ని అందించిన దాతను సత్కరిస్తున్న ఏఈవో

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన ఎం.మనోహర్‌రెడ్డి కుటుంబ సమేతంగా రూ.5 లక్షల విరాళాన్ని ఏఈవో ఫణిధరప్రసాద్, పర్యవేక్షకులు టి.హిమబిందుకు అందజేశారు. విరాళాన్ని అందించిన దాతకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్యసేవలు

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ
- విధులకు గైర్హాజరైన ఇద్దరు డాక్టర్లు, ఫార్మసిస్టుకు మెమోలు



వైద్యసేవలపై వివరాలు తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

మహానంది: గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలు అందుతున్నాయని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. నాడు నేడు పథకం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కాగా ఆ సమయంలో వైద్యులు భగవాన్‌దాస్, శాంతిప్రియ, ఫార్మాసిస్టు ఆసుపత్రిలో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరు కావడంతో మెమోలు జారీ చేయడంతో పాటు ఒకరోజు వేతనం నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం రికార్డులు పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో ప్రసవం అయిన గిరిజన గూడెంకు చెందిన మహిళకు బ్యాంక్ ఖాతా లేని విషయం తెలుసుకున్న డాక్టర్ వెంకటరమణ వెంటనే ఏపీజీబీ ఆర్ఎం, ఉన్నతాధికారులతో మాట్లాడారు. సిబ్బంది బ్యాంకుకు చేరుకుని అకౌంటు చేయించారు.

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.4.27 లక్షలు

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి మాఘ మాసం శనివారం సందర్భంగా వివిధ సేవల ద్వారా రూ.4,27,652 ఆదాయం వచ్చినట్లు ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించుకున్నారు.

ఖాళీల భర్తీపై అభ్యంతరాలు తెలపండి

నంద్యాల(అర్బన్): వన్‌స్టాప్ సెంటర్‌లో ఖాళీల భర్తీపై అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలుపాలని జిల్లా స్త్రీశిశు అభివృద్ధి, మహిళాసాధికారిత అధికారిణి నిర్మల శనివారం సూచించారు. నంద్యాల జిల్లాలోని వన్‌స్టాప్ సెంటర్‌లో ఖాళీల భర్తీ కోసం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశామన్నా రు. వాటికి సంబంధించి ఎలిజిబుల్, నాన్ ఎలిజిబుల్ లిస్టును http://nandyal.ap.gov.in// వెబ్ సైట్‌లో ఉంచామన్నారు. ఈ జాబితాకు సంబంధించి అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీలోగా నేరుగా తమ కార్యాలయానికి వచ్చి రాత పూర్వకంగా అందజేయాలన్నా రు. తరువాత వచ్చిన అభ్యంతరాలు పరిశీలింపబడవన్నారు.


అయోమయం.. గందరగోళం

ఇలాగైతే నేనెలా గెలుస్తా?

నంద్యాల టికెట్ నాకొద్దంటూ చేతులెత్తేసిన మాజీ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్


- ఓటమి తప్పదని పోటీ చేయడం మూర్ఖత్వమని ప్రస్తావన
- కార్యకర్తల వద్ద గోడు వెళ్లబోసుకున్న టీడీపీ నేత
- ఇన్‌చార్జిగా ప్రకటించి రెండు నెలలు గడవకముందే చేతులెత్తేసిన టీడీపీ

'ఎమ్మెల్యే టికెట్ ఇస్తాం పోటీ చెయ్' అని చెబుతున్నా స్వచ్ఛందంగా తప్పుకుంటున్నారు టీడీపీ నాయకులు. ఓటమి తెలిసి పోటీ చేయడం మూర్ఖత్వమంటూ మాజీ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ తన అనుచరుల వద్ద గోడు వెళ్లబోసుకుంటున్నారు. నంద్యాల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిని తప్పించి ఫరూక్‌ను ఇన్‌చార్జ్‌గా తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. నాలుగున్నరేళ్లుగా తనతో పార్టీ కోసం కోట్లు ఖర్చు పెట్టించి ఉన్నఫళంగా ఇన్‌చార్జ్‌గా తొలగించడంతో భూమా బ్రహ్మం తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఫరూక్‌కు మద్దతు ఇచ్చేదిలేదని ఖరాకండిగా చెప్పేశారు.



తెలుగుదేశం పార్టీ అధిష్టానం అనుసరిస్తున్న వైఖరితో నంద్యాల జిల్లా క్యాడర్ అయోమయంలో పడింది. ఓ వైపు విభేదాలు.. మరో వైపు ఓటమి భయం.. ఇంకో వైపు జనసేనతో పొత్తు పెట్టుకోవడం, బీజేపీతో పొత్తుకు వెంపర్లాడుతుండటంతో ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు వచ్చే ఎన్నికల్లో బరిలో నిలవాలా? వద్దా అనే సందిగ్ధంలో పడ్డారు. శ్రీశైలంలో బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి టికెట్ ఇస్తే ఓడిస్తామని ఓ వర్గం ప్రకటించడం, నంద్యాలలో మాజీ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పోటీకి వెనకడుగు వేస్తుండటంతో అంతా గందరగోళం నెలకొంది.

– సాక్షి, నంద్యాల



మొదటి నుంచి అయిష్టంగానే..
నంద్యాల నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కంచుకోట. సిట్టింగ్ ఎమ్మెల్యే శిల్పా రవి బలంగా ఉండడంతో టీడీపీ నుంచి పోటీ చేసేందుకు ఎన్‌ఎండీ ఫరూక్ ఆసక్తి చూపలేదు. అధిష్టానం బలవంతంతో అయిష్టంగానే ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. మరోవైపు భూమా నుంచి మద్దతు లేకపోవడంతో తాను పోటీ చేయనని, తన స్థానంలో ఎవరిని నిలబెట్టినా గెలుపుకోసం మద్దతిస్తానని ఫరూక్ అంటున్నారు. వాస్తవానికి నంద్యాల నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలు గెలుపోటములు నిర్ణయించే స్థితిలో ఉన్నారు. వైఎస్సార్ సీపీ వైపున్న మైనార్టీలలో కొంతమందినైనా తమ వైపునకు తిప్పుకోవాలనే ఆలోచనతో నంద్యాల ఇన్‌చార్జిగా ఫరూక్‌ను టీడీపీ నియమించింది. టీడీపీ అధినేత చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం వెంపర్లాడుతుండడంతో ఫరూక్ అంతర్మథనంలో పడ్డారు. బీజేపీతో పొత్తు ఉండే పక్షంలో తాను పోటీ నుంచి తప్పుకుంటానని చెబుతున్నారు. పొత్తుపై స్పష్టత వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలు చేపట్టవద్దని అనుచరులు, కార్యకర్తలకు స్పష్టంగా చెప్పేశారు. పొత్తు ఉన్నా లేకపోయినా ఈ వయసులో తాను పోటీ చేయలేనని, మరొకరికి సీటు ఇవ్వాలని చంద్రబాబును కోరుతున్నట్లు తెలుస్తోంది. ఇన్‌చార్జిగా ఫరూక్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి టీడీపీ కేడర్‌లో జోష్ కొరవడింది. నియోజకవర్గ కార్యకర్తలంతా రెండు వర్గాలుగా విడిపోయారు. తాజాగా ఫరూక్ చేతులెత్తేస్తుండడంతో కేడర్ చెల్లాచెదురైంది. ఎన్నికలకు ముందే ఇక్కడ ఓటమిని ఒప్పుకోవడం గమనార్హం.

సహకరించే ప్రసక్తే లేదు
బుడ్డా రాజశేఖరరెడ్డికి ఈ ఎన్నికల్లో టికెట్ ఇవ్వొద్దని టీడీపీ సీనియర్ నాయకుడు, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహ్మద్ హుస్సేన్ డిమాండ్ చేస్తున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి తాను పార్టీనే నమ్ముకున్నామని, ఈ ఎన్నికల్లో ముస్లింల తరపున తనకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వని పక్షంలో బుడ్డాను తప్పించి ఎవరికిచ్చినా సహకరిస్తామని, బుడ్డాకు టికెట్ ఇస్తే అతన్ని తామే ఓడిస్తామని హెచ్చరిస్తున్నారు. బుడ్డా వ్యవహారం ముస్లింలను వ్యతిరేకించేలా ఉందని, ఆయన టీడీపీలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింలను చిన్న చూపు చూస్తున్నారని చెబుతున్నారు. శ్రీశైలం నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లిం మైనారీలు భారీగా ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంట ఉన్నారు. టీడీపీలో ఉన్న కొద్ది మందికి కూడా ఆ పార్టీ ప్రాముఖ్యత ఇవ్వకపోవడంతో ముస్లింలంతా తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. గతేడాది నియోజకవర్గంలో జరిగిన యువగళం సభలోనూ ముస్లిం మైనార్టీలను అవమానించిన ఘటన తామింకా మర్చిపోలేదని చెబుతున్నారు. టికెట్ విషయంలో అసంతృప్తి అధికంగా ఉండటంతో దిక్కుతోచనిస్థితిలో టీడీపీ అధిష్టానం ఉంది. బుడ్డాకు టికెట్ ఇస్తే ముస్లిం మైనార్టీలంతా దూరమయ్యే పరిస్థితి ఉన్న నేపథ్యంలో చంద్రబాబు మీమాంసలో ఉన్నట్లు సమాచారం.

'బుడ్డా'కు అసమ్మతి సెగ

శ్రీశైలం టీడీపీలో రచ్చకెక్కిన విభేదాలు

- ఇన్‌చార్జి రాజశేఖరరెడ్డిపై తీవ్ర వ్యతిరేకత
- ఆయనకే టికెట్ ఇస్తే ఓడిస్తామంటున్న మైనార్టీలు
- ముస్లింలకు సీటు కేటాయించాలని డిమాండ్

శ్రీశైలం టీడీపీలో వర్గ విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. వర్గాలుగా విడిపోయి ఎమ్మెల్యే టికెట్ తమకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. టికెట్ కేటాయింపులో అన్యాయం జరిగితే టీడీపీ అభ్యర్థిని తామే ఓడిస్తామంటూ బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. దీంతో టికెట్ దక్కని నాయకులు తిరుగుబాటు బావుటా ఎగరేస్తారేమోనన్న భయం టీడీపీ అధిష్టానాన్ని కలవరపెడుతోంది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బుడ్డా రాజశేఖర్ రెడ్డి తనకే టికెట్ కేటాయించాలని కోరుతున్నారు. మరోవైపు మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి రేసులో ఉన్నారు. వీరిద్దరూ కాదని ముస్లిం సామాజిక వర్గానికి ఈసారి టికెట్ ఇవ్వాలని ఆ వర్గ నాయకులు కోరుతున్నారు. వారం క్రితం నియోజకవర్గ ముస్లింల ఆత్మీయ సదస్సు నిర్వహించి టికెట్ తమకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

అన్నిరంగాల్లో అద్భుతమైన ప్రగతి





నగరవనంలో ఫారెస్ట్ అధికారులు, నాయకులతో మంత్రి బుగ్గన, చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి బుగ్గన, ఎంపీ పోచా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

- సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందంజ
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

డోన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించిందని ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం డోన్ మండలం స్తోత్రం గుండాల గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో రూ.5కోట్లతో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కలెక్టర్ శ్రీనివాసులుతో కలసి ప్రారంభించారు. అలాగే డోన్ మండలం ఎర్రగుంట్ల నగరవనంలో రూ.3.8 కోట్ల వ్యయంతో చేపట్టిన ఎకో ట్రెనింగ్ సెంటర్, రెస్టారెంట్, కెఫేటీరియా ప్రాంగణాలను మంత్రి బుగ్గన ప్రారంభించారు. అనంతరం రూ.20 కోట్లతో కొత్తకోట వద్ద జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్న డ్రైవింగ్ శిక్షణ కేంద్రం పనులను ఆయన పరిశీలించారు. పనులు మందకొడిగా సాగుతుండటం పట్ల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా స్తోత్రం గుండాల గ్రామంలో నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. నిరుపేద, మధ్యతరగతి ప్రజల జీవనస్థితిగతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు చిరస్మరణీయమన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలా సంక్షేమ పథకాలను చేపట్టిన దాఖలాలు లేవన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు.

గుడికి వచ్చి మొక్కడం తప్ప ఏమి చేశారు?
50 ఏళ్లగా ప్రతి ఎన్నికల ముందు స్తోత్రం గుండాల గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి వచ్చి మొక్కడం తప్ప ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఏ ఒక్క నాయకుడు కృషి చేయలేదన్నారు. ఇంటి ఇలవేల్పు చెన్నకేశవ స్వామి అని చెప్పుకునే నాయకులు ఆలయం శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. శ్రీకృష్ణదేవరాయల హయాంలో నిర్మించిన ఈ పురాతన ఆలయాన్ని పునర్నిర్మించేందుకు రూ.4.4 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

సీఎంకు రుణపడి ఉండాలి..
గత ఎన్నికల ముందు బేతంచెర్ల పట్టణ బహిరంగ సభలో నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతానని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే అడిగిందే తడవుగా అన్ని వరాలను ప్రకటించి ఈ ప్రాంతం రూపురేఖలను మార్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. రూ.621 కోట్లతో 340బీ జాతీయ రహదారి, రూ.250 కోట్లతో హంద్రీనీవా నీటితో చెరువులను నింపడం, రూ.351 కోట్లతో వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా ఇంటింటికి శుద్ధ జలాన్ని అందించడం, రూ.40 కోట్లతో ప్రభుత్వాసుపత్రి, రూ.16 కోట్లతో ఆధునిక కూరగాయల మార్కెట్, నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలు, నాలుగు ప్రభుత్వ బాల, బాలికల వసతి గృహాలు ఇలా రూ.2,500 కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులను నియోజకవర్గంలో చేపట్టడం జరిగిందన్నారు.

రోడ్డు లేని గ్రామం లేదు..
నియోజకవర్గంలో ప్రతి మారుమూల గ్రామానికి రహదారి సౌకర్యాన్ని కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే కేంద్రియ విద్యాలయాన్ని డోన్‌కు మంజూరు చేయించడంలో మంత్రి బుగ్గన పట్టుదల అందరికీ తెలిసిందన్నారు. విద్య, వైద్య, పారిశ్రామిక, ఉపాధి రంగాల్లో కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే డోన్‌ను జిల్లాలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత మంత్రి బుగ్గనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ మహేశ్వర రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌ఓ అనురాగ్ మీనా, అటవీ రేంజ్ అధికారి ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ డీఎఫ్‌ఓ ఎం సూర్యచంద్రరాజు, టీటీడీ కల్యాణ మండపం కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, సింగిల్‌విండో అధ్యక్షులు తిరుమలరెడ్డి, కోట్రాయి సర్పంచ్ తేజోమణి, దేవస్థానం చైర్మన్ వెంకటయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పోస్టుపసాద్, దొరపల్లె చిరంజీవి, గిడ్డారెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుంభాభిషేక పూజలు



హోమం చేస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహారుద్ర శతచండీ వేదస్వాహాకార పూర్వక మహాకుంభాభిషేక క్రతువు కొనసాగుతోంది. రెండో రోజు శనివారం ఆలయంలో పూజాదికాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు గోపూజ, మండప పూ జ, జపములు, వేదపారాయణాలు, గణపతి, రుద్ర, చండీ పారాయణాలు, హోమాలు, వేదహవనములు జరిపారు. అలాగే సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30గంటల వరకు క్షీరాధివాసం, దేవతాహవనము లు, వేదహవనములు, వేదస్వస్తి, నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజలు చేశారు. రాష్ట్రంలోని వివిధ దేవాలయాలకు చెందిన అర్చకులు శ్రీశైలం చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధానాలయంలోని శివాజీగోపుర పునర్నిర్మాణం, ఆలయ ప్రాంగాణంలోని కొన్ని ఉపాలయాల పునరుద్ధరణ, పంచమఠాలలోని మూడు మఠాల పునరుద్ధరణ, ఆయా ఉపాలయాలలో, మఠాల్లో శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠ సందర్భంగా మహాకుంభాభిషేకాన్ని జరిపిస్తున్నారు. ఈ నెల 21న మహాకుంభాభిషేకం సందర్భంగా పునరుద్ధరించిన ఆలయాలలో యంత్ర ప్రతిష్ఠలు, శివలింగ-నందీశ్వరుల ప్రతిష్ఠలు, శివాజీగోపురమునకు సువర్ణ కలశ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.

వివాహ సంబంధాల పేరిట మోసం

- రూ. 2. 23 లక్షలు పోగొట్టుకున్న వైనం

కోవెలకుంట్ల: రైల్వేశాఖలో పని చేస్తున్న ఓ యువకుడిని వివాహ సంబంధాల పేరిట మోసం చేసిన సంఘటన కోవెలకుంట్లలో చోటు చేసుకుంది. శనివారం ఎస్ఐ వరప్రసాద్ అందించిన సమాచారం మేరకు.. చెన్నైకు చెందిన హరీష్‌కుమార్ కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌లో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. వివాహం చేసుకునేందుకు ఆన్‌లైన్ ద్వారా మ్యాట్రీమోనీని సంప్రదించాడు. అమెరికా సంబంధం ఉందని ఇందులోని కొందరు వ్యక్తులు ఓ యువతి ఫేక్ ఫొటోలను సృష్టించి సంబంధం కుదుర్చుతామని నమ్మ బలికారు. ఆ యువతి ఇండియాకు వచ్చేందుకు రూ. 2.23 లక్షలు డబ్బులు ఇవ్వాలని సూచించారు. ఆ వ్యక్తుల మాటలు నమ్మిన హరీష్‌కుమార్ తన బ్యాంకు ఖాతా నుంచి నగదు బదిలీ చేశాడు. తర్వాత ఎలాంటి సమాచారం లేకపోవడంతో మోసపోయానని భావించి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పవర్ ప్రాజెక్టులకు భూముల పరిశీలన

కొలిమిగుండ్ల: నందిపాడు సమీపంలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్రాజెక్ట్, పవర్‌గ్రిడ్ ఏర్పాటుకు సంబంధించిన అవసరమైన భూములను శనివారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. 310 సర్వే నెంబర్‌లో 330 ఎకరాల ప్రభుత్వ భూమిని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు కేటాయించడంతో ఇప్పటికే పనులు మొదలు పెట్టారు. వాటికి సంబంధించిన భూములను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. పవర్ గ్రిడ్‌కు సమీపంలోని 609 సర్వే నంబర్‌లో 2,150 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేసేందుకు సంబంధించిన ప్రతినిధులు 1,600 ఎకరాల భూమి కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. వీటిపై జేసీ భూమి పరిశీలించి రైతుల భూములు ఉన్నాయా? ఏవైనా అభ్యంతరాలు ఉన్నాయా? అని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట తహసీల్దార్ సునీతబాయి, సోలార్ ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల సన్నద్ధత ప్రణాళిక సిద్ధం చేయండి

● జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: 2024 సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతకు పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు నోడల్ అధికారులను ఆదేశించారు. శనివారం జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఎన్నికల సంసిద్ధతపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండి విధులను నిర్వహించాలన్నారు. పోలింగ్ విధుల నిర్వహణకు అన్ని శాఖల సిబ్బంది వివరాలు తెప్పించుకొని ర్యాండమైజేషన్ పద్ధతిలో విధుల కేటాయింపుకు సిద్ధంగా ఉండాలని మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ కమిటీ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అన్ని కళాశాలలు, విద్యాసంస్థల్లో ఇంకా ఓటు హక్కు నమోదు చేసుకోని విద్యార్థులను గుర్తించి ఫార్మ్ 6 ద్వారా వివరాలు సేకరించి నమోదు చేసే ప్రక్రియపై దృష్టి సారించాలన్నారు. పోలింగ్ నిర్వహించే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఇవ్వాలన్నారు. పోలింగ్ మెటీరియల్ సరఫరా లోటుపాట్లు లేకుండా నివేదికలు తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన, భద్రత, రవాణా తదితర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాలపై పర్యవేక్షించేందుకు ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేసుకోవాలని ఎక్స్పెండేచర్ మానిటరింగ్ కమిటీ నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్టోరల్ రోల్‌పై ఎప్పటికప్పుడు చర్యలు చర్యలు తీసుకోవాలని సంబంధిత కమిటీ నోడల్ అధికారులను సూచించారు.

మల్లన్నను దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి


న్యాయమూర్తికి స్వామివారి శేషవస్త్రాన్ని అందిస్తున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లి కార్జున స్వామి వార్లను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శనివారం స్వామి అమ్మవార్ల దర్శనార్థం వచ్చిన న్యాయమూర్తి సుబ్బారెడ్డికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి మల్లికార్జున స్వామి, భ్రమరాంబా దేవిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద నున్న ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తికి వేదాశీర్వచనం చేశారు. దేవస్థానం ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

రైతుల పోరాటాన్ని అడ్డుకోవడం అప్రజాస్వామికం

● సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ గోపాలగౌడ, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్


సదస్సులో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్

కర్నూలు(సెంట్రల్): పంటలకు కనీస మద్దతు ధర(ఎంస్‌ఎపీ) కోసం రైతులు పోరాటానికి దిగితే కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం అప్రజాస్వామికమని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ గోపాల గౌడ, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ అన్నారు. ఎంస్‌పీ చట్టాన్ని తెస్తామని సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్‌ను దాఖలు చేసిందని, మూడేళ్లయినా చట్టం తేలేకపోవడంతో రైతులు పోరాటం చేస్తున్నారన్నారు. శనివారం కర్నూలులోని లలితకళా సమితిలో రాజ్యాంగాన్ని రక్షించుకుందాం–ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అనే అంశంపై ప్రాంతీయ సదస్సును నిర్వహించారు. ముందుగా సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ మాట్లాడుతూ.. నరేంద్రమోదీ మూడోసారి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అవ్వడం ఖాయమన్నారు. దేశంలో పంటలు పండించే రైతులు, కష్టం చేసుకునే కూలీల నుంచి జీఎస్టీ వసూలు చేసే మోదీ.. బడా సంపన్నులకు ట్యాక్స్ 32 నుంచి 18 శాతానికి తగ్గించారన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డ్‌జడ్జి గోపాలగౌడ్ మాట్లాడుతూ.. గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో ఎంఎస్‌పీ కోసం పోరాటం చేసిన మోదీ, ప్రధానమంత్రి అయ్యాక చట్టం తేవడం కుదరని చెప్పడం అన్యాయమన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారతరత్న అవార్డును ప్రకటించిందని, అయితే ఆయన ఆశించిన ఎంఎస్‌పీ ప్రతిపాదలకు చట్టం చేయలేమని చెప్పడం దారుణమన్నారు. రాజ్యాంగ విశ్లేషకుడు ఫైసల్‌ఖాన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ మాట్లాడుతూ.. మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయితే రాజ్యాంగంలో లౌకికం అనే పదం ఉండబోదన్నారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి, ప్రత్యేక హోదా ఉద్యమ నేత చలసాని శ్రీనివాసరావు, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు విజయరావు, ఏపీ రైతు సంఘం నాయకులు పి.రామచంద్రయ్య, కె.ప్రభాకరరెడ్డి, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డీ గౌస్‌దేశాయ్, బి.గిడ్డయ్య పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా షేక్ ఇక్బాల్



కర్నూలు (టౌన్) : వైఎస్‌ఆర్‌సీపీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శిగా షేక్ ఇక్బాల్ బాషాను నియమితులయ్యారు.పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెడ్డి ఆదేశాల మేరకు నియమాక ఉత్తర్వులు జారీ చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఇక్బాల్ వెల్లడించారు.

మైనర్లు వాహనాలు నడిపితే యజమానిపై చర్యలు

బొమ్మలసత్రం: మైనర్లు వాహనాలు నడిపితే సదరు వాహనం యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ఎదుటి వారి మరణానికి కారకులైతే వాహన యజమానిపై ఐపీసీ సెక్షన్ 304 కింద కేసు నమోదు చేస్తామని వివరించారు. కోర్టులో నేరం రుజువైతే ఈ సెక్షన్ కింద 10 ఏళ్ల జైలు శిక్షపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడిపి ఎదుటి వారిని గాయపరిస్తే కనీసం ఇన్సూరెన్స్ కూడా బాధితులకు లభించదని వివరించారు. జిల్లాలో ఎక్కడైనా వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా నడిపినా, ప్రమాదాలు జరిగినా వెంటనే 100కు ఫోన్ చేయాలని సూచించారు.

20న హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్): బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి పి. సువర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు 14 సంవత్సరాలు పైబడి ఉన్న బాలికలు అర్హులని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈనెల 23, 24 తేదీల్లో నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యం

● కర్ణాటక బ్యాంకు సీనియర్ మేనేజర్ చంద్రహాస్‌రెడ్డి



కర్నూలు(అగ్రికల్చర్): ఖాతాదారుల సంక్షేమ మే లక్ష్యంగా కర్ణాటక బ్యాంకు పనిచేస్తోందని ఆ బ్యాంక్ సీనియర్ మేనేజర్ వి.చంద్రహాస్‌రెడ్డి తెలిపారు. కర్ణాటక బ్యాంకు ఏర్పడి 100 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శనివారం పార్క్ రోడ్డు బ్రాంచీలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ... కర్ణాటక బ్యాంకుకు కర్నూలు లో 2, ఆదోని, మంత్రాలయం, నంద్యాలలో ఒక్కో బ్రాంచీ ఉన్నాయని తెలిపారు. 1924 ఫిబ్రవరి 24న కర్ణాటక బ్యాంకు ఆవిర్భవించిందని, నాటి నుంచి ఖాతాదారుల సేవల్లో తరిస్తోందన్నారు. ఖాతాదారుల సంక్షే మం లక్ష్యంగా రూ.300 ప్రీమియంతో రూ.10 లక్షలకు ప్రమాదబీమా సదుపాయం కల్పిస్తోందని తెలిపారు. రూ.150 ప్రీమియంతో రూ.5 లక్షలకు ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తోందని, 80 ఏళ్ల వరకు ఈ సదుపాయం ఉందని పేర్కొన్నారు. డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీరేట్లు ఇస్తోందని తెలిపారు. అన్ని రకాల రుణ సదుపాయం కల్పిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన ఇర్ఫాన్ (ఫైల్)

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం నగర శివారులోని ఓ జూనియర్ కాలేజీలో చోటు చేసుకుంది. ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడకు చెందిన తోళ్ల షఫీవుల్లా, ఖాజాబీ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు తోళ్ల ఇర్ఫాన్ నగర శివారులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియేట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ గ్రూప్ చదువుతున్నాడు. రోజూ ఉదయం 6.30 గంటలకు తరగతులకు వెళ్లేవాడు. అయితే శనివారం తన రూంమెట్స్ వెళ్లినా కూడా ఇర్ఫాన్ రూంలోనే ఉండిపోయాడు. సాయంత్రం 5గంటలకు తరగతులు ముగించుకొని రూంకి వెళ్లిన విద్యార్థులు తలుపులు కొట్టారు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో గట్టిగా తలుపులు తోయడంతో గదిలో పైకప్పుకు టవల్స్‌తో ఇర్ఫాన్ ఉరేసుకున్న విషయం గుర్తించారు. విషయం నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లగా కిందకు దించి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తాలుకా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇదిలాఉంటే ఇర్ఫాన్‌ను కొంత మంది క్లాస్‌మెట్స్, సీనియర్లు ఎగతాళిగా మాట్లాడడంతోనే మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్లు ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం ఉమ్మడి జిల్లాల కబడ్డీ బాల, బాలికల సబ్‌జూనియర్ జట్లను ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏపీ రెడ్డి పాల్గొని కబడ్డీ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాల నుంచి 400 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కబడ్డీ అసోసియేషన్ నాయకులు నాగరాజు, నాగేంద్రలు తెలిపారు. క్రీడాకారులకు నంది పైప్స్ ఎండీ సుజల భోజన వసతి కల్పించారు. క్రీడాకారులను ఉద్దేశించి ఏపీరెడ్డి, ఎంఈఓ సుబ్రమణ్యం, సుజలమ్మలు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి కనబరచాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపా ధ్యాయులు సురేష్‌నాయుడు, సురేష్, శ్రీను, సిద్దార్థరాజు, శివ, జనార్ధన్, మున్నా పాల్గొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

● వివాహేతర సంబంధమే కారణం
● ఆలస్యంగా వెలుగులోకి


పంచనామా నిర్వహిస్తున్న సీఐ, వన్‌టౌన్ పోలీసులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలో దేవస్థానం నిర్వహిస్తున్న ఓ వసతి సముదాయంలో హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. దేవస్థానం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఆత్మహత్య విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ ప్రసాదరావు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాదుకు చెందిన మల్లేష్ (35), సరిత (28) ఈనెల 13వ తేదీన శ్రీశైలం చేరుకుని స్థానిక ఓ వసతి సముదాయంలో గది అద్దెకు తీసుకున్నారు. వారు ఇచ్చిన వివరాల మేరకు ఈనెల 15న ఖాళీ చేయాల్సి ఉండగా 17వ తేదీ ఉదయం వరకు వారి సమాచారం లేదు. అయినా అక్కడి సిబ్బంది పట్టించుకోలేదు. పక్క గదిలో బస చేసిన యాత్రికులకు దుర్వాసన వస్తుండటంతో ఫిర్యాదు చేయడంతో అందులో ఇద్దరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. పోలీసులు గదిని పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతురాలి సరిత దగ్గర లభించిన ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ల ఆధారంగా ఆచూకీ గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాదు సరూర్ నగర్‌కు చెందిన సరిత, శంకర్ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా శంకర్ స్నేహితుడైన కార్పెంటర్ మల్లేష్‌తో సరితకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఏమి జరిగిందో తెలియదు కానీ ఇద్దరూ శ్రీశైలం వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డారు. హైదరాబాదులో మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సరిత మిస్సింగ్ కేసు నమోదు అవ్వడంతో అక్కడి పోలీసులు శనివారం సాయంత్రం శ్రీశైలం చేరుకున్నారు.

పురుగుమందు బాటిల్‌లో నింపిన నీరు తాగి వ్యక్తి మృతి


మృతిచెందిన ఈశ్వరయ్య

కర్నూలు : ఎస్‌ఆర్‌బీసీ అవుకు డివిజన్-3లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఈశ్వరయ్య (61) పొరపాటున పురుగు మందు బాటిల్‌లో నింపిన నీరు తాగి అస్వస్థతకు గురై కోలుకోలేక శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. కల్లూరు మండలం వెంకటాచలపతి నగర్‌లో నివాసముంటున్న ఈశ్వరయ్య ఉద్యోగ రీత్యా కర్నూలు నుంచి ప్రతి రోజూ అవుకుకు వెళ్లి వచ్చేవాడు. ఈనెల 13వ తేదీ ఇంటి మొదటి అంతస్థులో ఉన్న మొక్కలకు పురుగుల మందు పిచికారీ చేసి ఈశ్వరయ్య భార్య ఖాళీ బాటిల్‌ను అక్కడే పడేశారు. అదే రోజు రాత్రి అవుకు నుంచి వచ్చి ఈశ్వరయ్య ఇంట్లో భోజనం చేసిన తర్వాత బాల్కనీలో పడుకున్నాడు. అర్ధరాత్రి అక్కడే పడి ఉన్న ఖాళీ బాటిల్‌లో నీళ్ల నింపుకుని తాగి కొద్ది సేపు తర్వాత వాంతులు చేసుకుంటుండగా భార్య శాంతకుమారి గమనించి ఆరా తీసి జరిగిన విషయం తెలుసుకుని ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించగా తనకు బాగానే ఉందంటూ ఈశ్వరయ్య మళ్లీ పడుకున్నాడు. అయితే మరుసటి రోజు విరేచనాలు ఎక్కువై నీరసించిపోవడంతో 15వ తేదీన ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్యచికిత్సలు చేయించారు. కోలుకోలేక 16వ తేదీ అర్ధరాత్రి మృతిచెందాడు.